ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023 8 పేజీలు




గుంటూరు పల్నాడు

ఉపాధి హామీ కుదింపు

దాదాపు సగానికి తగ్గిన పనులు గుర్తింపు, పనిదినాల లక్ష్యం



ప్రత్తిపాడు మండలంలో ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు (ఫైల్)

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సొంత ఊరులోనే పనులు కల్పించి వలసలను నివారించాలనే ఉద్దేశంతో తెచ్చిన ఉపాధి హామీ చట్టం క్రమంగా నిర్వీర్యమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో నిధుల్లో కోత విధించిన విషయం తెలిసిందే. దీని దుష్ఫలితం క్షేత్రస్థాయిలో మరింత ప్రస్ఫుటమవుతోంది. చట్ట ప్రకారం కల్పించాల్సిన పని దినాల కంటే సగానికి తక్కువగా గతేడాది పనులు కల్పించగా ఈ ఏడాది వాటిని మరింత తగ్గించారు.

ప్రత్తిపాడు మండలంలో 22 గ్రామాలు ఉండగా 49 వేల 390 మంది జనాభా ఉంటుందని అంచనా. మండలంలో 8059 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా వీటిల్లో యాక్టివ్ కార్డులు 5558గా అధికారులు పేర్కొంటున్నారు. చట్ట ప్రకారం ప్రతి కార్డుకూ 100 పని దినాలు కల్పిస్తే యాక్టిక్ కార్డుల ప్రకారం చూసినా 5 లక్షల 55 వేల 800 పనిదినాలు కల్పించాలి. అయితే గతేడాది కల్పించిన పని దినాలు 2 లక్షల 19 వేల 225 మాత్రమే. 3 లక్షల 36 వేల 575 పని దినాలను కూలీలు కోల్పోయారు. కల్పించిన పని దినాల్లోనూ 28,456 పని దినాలు గృహ నిర్మాణం కింద కేటాయించారు. అంటే జాబ్ కార్డు ఉన్నవారు ప్రభుత్వ పథకాల కింద ఇళ్లు నిర్మించుకుంటే ఒక్కో కార్డుకు 90 పని దినాల చొప్పున నగదును లబ్ధిదార్లకు చెల్లిస్తారు. ఈ విధంగా మండలంలో

2లో



గజాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి ఎన్.రామచంద్రరావు

పులులొస్తున్నాయ్..!

- సంచారంపై నిర్ధాణకు వచ్చిన అధికారులు
- ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన

ప్రజాశక్తి- దుర్గి, మాచర్ల

దుర్గి మండలం కాకిరాల అటవీ ప్రాంతంలో పులుల సంచారం ఉన్నట్లు నిర్ధారణైందని పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి ఎన్.రామచంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడిన ఆయన పలు వివరాలు వెల్లడించారు. అంతకుముందు దుర్గి మండలం గజాపురం గ్రామస్తులతో సమావేశమయ్యారు. పులుల సంచారం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దుర్గి మండలంలోని గజాపురం, రాజానగరం, కాకిరాల పరిధిలోని అటవి ప్రాంతాల్లో పులులు సంచరిస్తున్నట్లు నిర్ధారణైందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రస్తుతం సాగర్ టైగర్ ప్రాజెక్టు ప్రాంతం నుంచి రెండు మూడు పులులు అడవిలో నీటి వసతులు ఇబ్బందుల వల్ల సమీప పొలాల్లో నీటిని తాగేందుకు వచ్చి ఉంటాయని, ఆ సమయంలో గత వారం క్రితం ఓ ఆవు అక్కడ సంచరిస్తుండగా చంపినట్లు తమ సిబ్బంది గుర్తించారని వివరించారు. తరువాత గేదెల మీద కూడా దాడి చేసినట్లు సమాచారం ఉన్నా నిర్ధారణ కాలేదన్నారు.

పులుల సంచారంపై ప్రజల్లో కొంత

2లో



తాడేపల్లి మండలం ప్రాతూరులో పసుపు పంట రాసిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

5లో

నష్టపోయిన రైతులను ఆదుకోండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

సిఆర్‌డిఎ పరిధిలో ఇళ్ల స్థలాల అభివృద్ధి వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిఆర్‌డిఎ పరిధిలో తుళ్లూరు, మంగళగిరి మండలాల్లోని పేదలందరికీ ఇంటి స్థలాల పంపిణీకి స్థలాలను అభివృద్ధి చేసి, ప్లాట్‌ల మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఇంటి పట్టాల పంపిణీకి మే 15 నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక ప్రకారం సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. సిఆర్‌డిఒ పరిధిలో ఏర్పాటు చేసే లేఅవుట్ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు నియమించిన ప్రత్యేక అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రత్యేక బృందాల్లోని ఇంజినీరింగ్, సర్వే, అధికారులతో

2లో

పనికి పక్కవూరు వెళ్తుండగా ప్రమాదం

ట్రాక్టర్ పైనుండి పడి మహిళా కూలీ దుర్మరణం

ప్రజాశక్తి - వెల్దుర్తి

పక్క గ్రామానికి కూలి పనులకు వెళ్తుండగా వాటిల్లిన ప్రమాదంలో మహిళా కూలీ దుర్మరణం పాలైన మండలంలోని రచ్చమల్లపాడు-శ్రీరాంపురం తండా మధ్యలో గురువారం చోటుచేసుకుంది. రచ్చమలపాడుకు చెందిన పలువురు మహిళలు కొద్దిరోజులుగా చుట్టుపక్కల గ్రామాలకు కూలి పనులకు వెళ్తున్నారు. వీరితోపాటు షేక్ రంజాన్ బి (44) కూడా వెళ్తున్నారు. ఈ క్రమంలో కూలీలంతా కలిసి గురువారం ఉదయం ట్రాక్టర్‌లో శ్రీరాంపురం తండాకు పనుల కోసం వెళ్తున్నారు. మార్గం మధ్యలో ట్రాక్టర్ పైనుంచి జారిపడిన రంజాన్‌బి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ వి.శ్రీహరి కేసు నమోదు చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలి

మేయర్ మనోహర్‌నాయుడు

ప్రజాశక్తి - గుంటూరు



నగరపాలక సంస్థ పరిధిలోని ఏటి అగ్రహారం 2వ లైన్‌లో సమీప ప్రాంతానికి సంబంధించిన ఫాతిమా నగర్ సూచిక బోర్డును పట్టణ ప్రణాళిక విభాగం, కిందిస్థాయి సిబ్బంది అవగాహన లోపంతో చేసిన పొరపాటును మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని నగర పాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. నగరంలో ఏటి అగ్రహారం, శ్రీరాంనగర్ పేర్లను మార్చుతున్నట్లు గురువారం సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని కోరారు. ప్రశాంతమైన గుంటూరు నగరంలో మత విద్వేషాలను రెచ్చగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా ప్రధాన వీధులకు జిఎంసి సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తుందని, ఏటి అగ్రహారం 2వ లైన్ పక్కనే ఫాతిమా నగర్ ఉన్నదని, అటువైపు పెట్టాల్సిన ఆ ప్రాంత సూచిక బోర్డును ఏ.టి అగ్రహారం 2వ లైన్‌లో ఏర్పాటు చేయడంతో అగ్రహారం పేరు మారుస్తున్నారనే అపోహకు ప్రజలు గురయ్యా రని తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన నగర కమిషనర్ వెంటనే బోర్డు తొలగించటంతోపాటు, ఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. అదే ప్రాంతంలో ఏటి అగ్రహారం సూచిక బోర్డును శుక్రవారం సాయంత్రంలోపు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించామని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కూడా స్పందించి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రకటనలు చేయడం సరికాదని హితవు పలికారని పేర్కొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో స్పష్టం చేశారు.

సిఆర్‌డిఎ పరిధిలో ఇళ్ల స్థలాల అభివృద్ధి వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్‌లో గురువారం సమావేశమయ్యారు. పెదకాకాని, తుళ్లురు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారులు దాదాపు 20 వేల మందికి ఇంటి స్థలాల కేటాయింపునకు మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, ఐనవోలు గ్రామాల్లో 10 లే అవుట్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీలోపు లే అవుట్‌లలో అభివృద్ధి పనులు, రహదారుల ఏర్పాటు, ప్లాట్‌ల మార్కింగ్ చేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీకి సిద్ధం చేయాల్సి వుందన్నారు. పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ట్రైనీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, మోవిడ వాణి, ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు సిఐగా అల్తాఫ్ హుస్సేన్

ప్రజాశక్తి-తాడేపల్లి


సిఐ ఎండి అల్తాఫ్

తాడేపల్లి అదనపు సిఐగా ఎండి అల్తాఫ్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేడికొండూరు సిఐగా విధులు నిర్వర్తిస్తున్న అల్తాఫ్ హుస్సేన్ తాడేపల్లికి అదనపు సిఐగా బదిలీ అయ్యారు. తాడేపల్లి సిఐగా విధులు నిర్వర్తించిన సాంబశివరావు సిఐడికి బదిలీ కావడంతో ఆ స్థానంలో అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరించారు.

'వ్యవసాయంపై మాట్లాడే అర్హత టిడిపికి లేదు'

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్


గేరా సుబ్బయ్య

వ్యవసాయం దండగ అన్న టిడిపి నాయకులకు వ్యవసాయంపై మాట్లాడే అర్హత లేదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో వ్యవసాయ గిట్టుబాటు ధరలపై ధర్నా చేపట్టడం సిగ్గుచేటన్నారు. అమరావతి ప్రాంతంలో మూడు పంటలు పండే 35 వేల ఎకరాల వ్యవసాయ భూమిని రాజధాని పేరిట లాక్కొన్న టిడిపి నాయకులు ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపుతూ ముసలి కన్నీరు కార్చడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీపై ఆరోపణలు మానుకోవాలని, అభివృద్ధిని చూసి సహకరించాలని హితవు పలికారు.

రెండు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలోని కాకుమాను వారి తోట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని అధికారులు గురువారం ప్రకటించారు. వసంతరాయపురం, బొంగరాలబీడు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని గుంటూరు-4 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పిహెచ్ ఖాన్ కోరారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు


విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

జాతీయ రహదారుల విస్తరణ పనులు చేపట్టేందుకు భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రరేటరి డా.కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు. గురువారం జాతీయ రహదారులకు భూ సేకరణ, టూరిజం అభివృద్ధికి భూ కేటాయింపు, 4జి మొబైల్ సర్వీసుల ఏర్పాటుకు భూ కేటాయింపు, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు, వ్యవసాయం, హార్టికల్చర్, పశు సంవర్ధకం, డైరీ డెవలప్మెంట్, హౌసింగ్, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి అంశాల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణ పనులకు ఈ ఆర్థిక సంవత్సరం అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. టూరిజం అభివృద్ధి పనులు చేపట్టేందుకు, టూరిజం కార్పొరేషన్ వారు కోరిన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను అందించాలని కోరినందున ఆ మేరకు భూములను వెంటనే కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను కొరారు. గుంటూరు కలెక్టరేట్ నుండి విసిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి వివరిస్తూ రోడ్ సైడ్ ఏమినిటీస్ సెంటర్ ఏర్పాటుకు పొత్తూరు గ్రామం వద్ద గుర్తించిన 3 ఎకరాల భూమి వాగు పోరంబొకు అయినందున ప్రత్యామ్నాయంగా స్థలాన్ని గుర్తించి టూరిజం కార్పొరేషన్ వారికి ప్రతిపాదనలు పంపటం జరుగుతుందని తెలిపారు. అలాగే భవాని ఐల్యాండ్ విస్తరణ కొరకు ప్రతిపాదించిన 311.78 ఎకరాల భూమిని పరిశీలించి త్వరితగతిన టూరిజం కార్పొరేషన్ వారికి ప్రతిపాదనలు పంపటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ మోహన్ రావు, హౌసింగ్ పి.డి సాయినాథ్, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, డి.పి.ఓ కేశవ్ రెడ్డి, మెప్మా పి.డి వెంకట నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యుగంధర్ కుమార్, ఆర్ డబ్ల్యూ ఎస్ పర్యవేక్షక ఇంజనీరు సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కుదింపు

(మొదటి పేజీ తరువాయి)

607 మంది లబ్ధిదార్లకు 28,456 పని దినాలను గృహ నిర్మాణం కింద కేటాయించారు.

ప్రస్తుతం మండలంలో వ్యవసాయ పనులు మొత్తం అయిపోయాయి. మిర్చి కళ్లాల్లో తాలుగాయలు ఏరే పని పరిమితంగా మినహా ఎక్కువ మంది కూలీలు ఉపాధి కోసం నిరీక్షిస్తుండగా ఇటీవలే ఉపాధి హామీ పనులను అక్కడక్కడా ప్రారంభించారు. కొంతమంది ఇతర ప్రాంతాలకు భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు. మళ్లీ ఖరీఫ్ మొదలయ్యే వరకూ ఉపాధి అస్తుబిస్తుగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాల్సిన అవసరం ఇప్పుడే ఎక్కువ. అయితే ఈ ఏడాది లక్ష్యం సగం వరకూ కుదించారు. గతేడాది మండలంలో ఫీల్డ్ ఛానల్స్, ఫీడర్ ఛానల్స్, మైనర్ ఛానల్స్, డ్రెయిన్లు, చెరువులు, రోడ్ల వెంట మొక్కల పెంపకం తదితరాలతోపాటు గృహ నిర్మాణంతో కలిపి 953 పనులు గుర్తించగా ఏడాది గుర్తించిన పనులు 515 మాత్రమే. పని దినాల లక్ష్యం సైతం లక్ష 61 వేల 136కు తగ్గింది. గతేడాది కల్పించిన పనులతో పోలిస్తే 58 వేల పని దినాల వరకూ తక్కువ. జులై తర్వాత లక్ష్యం పెరుగుతుందని అధికారులు చెబుతున్నా అప్పటికి వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది.

వాస్తవానికి గతంలో ఉపాధి హామీ పనుల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలు చూసేవి. తాజాగా కేంద్ర ప్రభుత్వమే ఇందుకు పూనుకుంది. ఇందులో భాగంగా అనేక కొత్త నిబంధనలు తెచ్చి పనులు లేకుండా చేయడం, కూలీలు పనికి రావాలంటే నిరుత్సాహానికి గురయ్యేలా చేయడం వంటి వాటికి పాల్పడుతోంది. గతంలో చెరువులు, కాల్వల పూడిక తీతలు అవసరాన్ని బట్టి ప్రతి ఏడాదీ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు కొత్త నిబంధన తెచ్చి ఒకసారి చేసిన పని మళ్లీ చేయడానికి వీల్లేకుండా చేస్తున్నారు. మండలంలో గుర్తించిన పనుల సంఖ్య దాదాపు సగానికి తగ్గడానికి ఇదే కారణంగా తెలుస్తోంది. ఇదే తీరు కొనసాగితే రానున్న కాలంలో కూలీలకు ఉపాధి హామీ పనులు మరింతగా దూరం కానున్నట్లు తేటతెల్లమవుతోంది.

పులులొస్తున్నాయ్..!

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన నెలకొందని, అయితే భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. పులులు మనుషుల్ని చంపి తినేవి కావని, అలాగని ఒంటరిగా అటవి ప్రాంతంలోకి వెళ్లడం, పశువులను పంపడం చేయవద్దని హెచ్చరించారు. పులల వల్ల ఎవరికీ హాని జరగకుండా అటవీశాఖ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోందన్నారు. అటవీ ప్రాంత సమీప పొలాల్లో రైతులు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని, పొరపాటున వాటివల్ల పులులకు ఏదైనా హాని జరిగితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో 75కు పైగా పులులు ఉన్నాయని, ఎక్కువగా శ్రీశైలం అభయారణ్యంలో ఉన్నాయని తెలిపారు. శ్రీశైలం వన్యప్రాణి అభయారణ్యం నాగార్జునసాగర్ విజయపురిసౌత్ వరకు కొనసాగుతున్నదని, గతంలో ఈ ప్రాంతంలో కూడా పులులు సంచారం ఉండేదని అన్నారు పులి పిల్లలు పెరిగి పెద్దయ్యాక కొత్త ప్రదేశాలను వెతుకుతూ వెళుతుంటాయని, వాటికి అనువైన ప్రదేశం కనిపిస్తే అక్కడ నివాసం ఉంటాయని తెలిపారు. ఒక్కొక్క పులి 25 నుంచి 50 చదరపు కిలోమీటర్ల పరిధిలో సంచరిస్తుందని, వాటి సంరక్షణకు వన్యప్రాణి విభాగ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ శాఖలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాయని తెలిపారు. పులుల సంరక్షణ కోసం సాసర్ పిట్స్ ఏర్పాటు చేసి వాటికి నీటి వసతి కల్పిస్తున్నామని, ప్రజలు సహకరించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు.


అటవీ సమీపంలోని పొలాల్లోకి చీకటి పడే వరకు ఉండొద్దని, నీరుపెట్టడానికి పొలాలకు రాత్రిపూట వెళ్లొద్దని, పగలి వేళల్లోనే పనులు ముగించుకోవాలని ప్రజలకు సూచించారు. పశువులను ఒంటరిగా అడవిలోకి వదిలేయొద్దని, అడవిలో చిక్కుకున్న పశువుల కోసం పులులు అడవి సమీపంలోని గ్రామాల వైపుకు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఒకవేళ పులులు గ్రామాల్లోకి వస్తే వాటికి ప్రమాదం లేకుండా, మనుషులకూ ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల అటవీర్ రేంజ్ అధికారి సయ్యద్ మహబూబ్ హుస్సేన్, సిబ్బంది వెంకయ్య వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పులుల సంచార విస్తీర్ణం 25-55 చదరపు కిలోమీటర్లను అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఈ విస్తీర్ణం పరిధిలోకి కారంపూడి, బొల్లాపల్లి ప్రాంతాలూ వస్తాయి. దీంతో ఈ ప్రాంతాల్లోని ప్రజలూ ఆందోళనకు గురవుతున్నారు. కాకిరాల అటవీ ప్రాంతానికి దగ్గరలో బొల్లాపల్లి మండలంలోని గండిగనుమల, దోమలగుండం, సోలాయపాలెం, రావులాపురం, మన్నేపల్లి తండా, గుట్లపల్లి, రేమిడిచర్ల, అయ్యన్నపాలెం తదితర గ్రామాలున్నాయి. ఇవి అడవికి చాలా దగ్గరలో ఉంటాయి. దీంతో గొర్రెలు ఆవులు గేదెలను అడవికి తీసుకువెళ్లి కాపరులు అటవీ ప్రాంతం వైపు వెళ్లాలంటే భయపడుతున్నారు.

కిట్స్‌లో అచీవర్స్ మీట్

ప్రజాశక్తి-గుంటూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోయి శేఖర్

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో 2022-23 సంవత్సరానికి చెందిన అచీవర్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బహుళజాతి కంపెనీల్లో ఉపాధి సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం అభినందించారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉత్తమ నైపుణ్యాలతో తీర్చిదిద్ది, బహుళజాతి సంస్థల్లో అత్యంత ఆకర్షణీయమైన వేతనాలతో మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమపై, కళాశాలపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తూ ఏటా అర్హులైన నూరుశాతం విద్యార్థులకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. 2022-23 సంవత్సరానికి 660 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులకుగాను 560 మంది అర్హులు కాగా వారిలో 460 మంది ప్రముఖ కంపెనీలకు ఎంపికయ్యారని చెప్పారు. కిట్స్‌లోనే కాక, తమ అనుబంధ గుంటూరు ఇంజినీరింగ్ కాలేజిలోనూ అర్హులైన 150 మందిలో 120 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ఉపాధి కల్పనలో ఇతర కళాశాలల కంటే కిట్స్ మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.



మేత మేస్తున్న గొర్రెలపై కుక్కలు దాడి

ప్రజాశక్తి-దుగ్గిరాల

మేత కోసం తోలు కెళ్ళిన గొర్రెలు కుక్కల బారినపడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం దుగ్గిరాలలో జరిగింది..స్థానిక అలినగర్ కు చెందిన కుతుబుద్దీన్ గొర్రెలను మేపుకొని జీవనం సాగిస్తుంటాడు, ఈ క్రమంలో గొర్రెలు మేపుకోవడానికి గ్రామానికి దక్షిణ వైపు ఉన్న పొలాల వైపు తోలు కెల్లగా మంగళవారం కుక్కలు దాడి చేసి మూడు గొర్రెలను చంపి వేశాయి. గురువారం మరో రెండు గొర్రెలను చంపేశాయి. మరొకటి మరో గొర్రె కొనఊపిరితో ఉంది. మేతమేస్తున్న గొర్రెలపై కుక్కల మంద అమాం తం దాడి చేస్తున్నాయని కుతుబుద్దీన్ తెలిపాడు. కుక్కలను తరిమేందుకు ప్రయత్నిస్తే అవి ఎదురు తిరుగుతున్నాయని అన్నాడు. ఈ ప్రాంతానికి చెం దిన రైతులు, పనులకు వెళ్లే కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ప్రజాశక్తి-ఈపూరు

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి కాలువలో దూకి ఆత్మహత్య సంఘటన మండలం లోని నల్లగొండ తండాలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన భూక్య రమేష్ నాయక్(35) కు భార్యకు అప్పుల విషయంలో గొడవ జరగగా భార్య పుట్టింటికి వెళ్ళింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రమేష్ ఊడిజర్ల గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



భూక్య రమేష్ మృతదేహం

ప్రభుత్వ భూమిని ఆక్రమించారని కేసు

ప్రజాశక్తి - చేబ్రోలు: జలవనరుల శాఖకు చెందిన ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని షెడ్డు నిర్మాణము చేసిన బాణాల అనిల్ కుమార్, బాణాల సునీల్ కుమార్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

పొలం వివాదంలో దాడి

ప్రజాశక్తి - మాచర్ల

రెండు చింతల మండలం మల్లవరంలో పొలం వివాదంలో యువకులపై దగ్గర బంధువులే దాడి చేసి గాయపరిచారు గాయాల పాలైన ఏసుబాబు నాయక్ ను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. ఏసుబాబు మాట్లాడుతూ గతంలో ఎప్పటినుండో తన నాన్న వాళ్ళ అన్నదమ్ములకు కలిసి కొంత వ్యవసాయ భూమి ఉండేదని, దానికి పట్టా కోసం ఈ మధ్య ప్రభుత్వం వారు అందించిన పథకం ప్రకారం దరఖాస్తు చేసుకున్నానని,తన తండ్రి చనిపోవడంతో తాను ఆ భూమి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పాడు. సర్వేయర్ ఆ భూమి కొలతల కోసం రావడంతో తాను అక్కడికి వెళ్లానని తన బాబాయ్ పిల్లలు'ఎక్కడ ఉందిరా పొలం' అంటూ పొలంలోనే తనపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారని, చంపబోయార ని ఆరోపించాడు. పారిపోయి వచ్చి 108 ద్వారా ప్రభుత్వ వైద్య శాలలో చేరినట్లు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం



ప్రజాశక్తి-యడ్లపాడు

యడ్లపాడు మండలం, కొండవీడు గ్రామానికి చెం దిన జనసేన పార్టీ కార్యకర్త యనగందుల శివరామకృష్ణ అప్పుల బాధతో ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ విష యం తెలుసుకున్న ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజ రమేష్, అతన్ని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనసేన తర పున రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రానున్న కాలంలో వారికి చిలకలూరిపేట జనసేన పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని తెలియజేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్, యడ్లపాడు ప్రధాన కార్యదర్శి పి.హనుమంతరావు, ఎనగందుల వీరాంజి, నాని,సీతయ్య, స్టీల్ అంజి, సూర్య, సాయి, వెంకటేష్, కరిముల్లా పాల్గొన్నారు.

గతుకుల రహదార్లతో అవస్థలు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదార్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎక్కడంటే అక్కడ గుంతలు వాహనదార్ల రాకపోకలకు పరీక్ష పెడుతున్నాయి. ఇదే రోడ్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం సంచరిస్తున్నా వారు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒన్‌వే లేకపోవటం, గుంతలు కారనంగా వాహనాలు అటుఇటూ వెళ్లేటప్పుడు ప్రమాదాలు వాటిల్లుతున్నాయి. చిన్న వానొచ్చినా పలుప్రాంతాల్లో రహదార్లపై గుంతల్లో నిలిస్తున్నాయి. వాహనాలు అటుగా వెళ్లే సందర్భంలో ఆ నీరంతా పైకి లేచి ఇతరులపై పడుతున్నాయి. అడ్డరోడ్డు సెంటర్ నుంచి పెదనందిపాడు చార్లెస్ కాన్వెంట్ వరకు 10-13 సార్లు బ్రేకులు వేయటం, గేర్లు మార్చడం తప్పనిసరి అవుతోందని వాహనదార్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అడ్డరోడ్డు వద్ద కళ్యాణ సెంటర్ ఎదురుగా, తహశీల్దార్ కార్యాలయం ఎదురు, గడియార స్తంభం వద్ద, గాంధీ పార్క్ ఎదురుగా, కళామందిర్ సెంటర్, నరసింహ స్వామి గుడి దగ్గర రహదార్లు గుంతలమయం అయ్యాయి. వీటిపై మున్సిపల్, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులను సంప్రదించగా తమకు సంబంధం లేదంటే తమకు సంబంధం లేదని దాటవేత సమాధానం ఇస్తున్నారు.





మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	93,186
మిర్చి ఎగుమతి	:	98,908
మిర్చి నిల్వ	:	63,179

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 22,000
నెం.5	9,000 - 20,000
273	11,500 - 18,500
341	10,000 - 25,000
4884	13,500 - 15,000
సూపర్ 10	12,500 - 17,500
నాన్ ఎసి	
తేజ	9,000 - 23,500
బడిగి	10,000 - 24,200
దేవనూరు డీలక్స్	9,000 - 20,000
తాలుకాయలు	6,000 - 13,000

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 197/2018

బిట్వీన్

విజయబ్యాంక్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ చీఫ్ మేనేజర్, చిలకలూరిపేట ... ప్లెయింటిఫ్

వర్సెస్

విఘ్నేశ్వర మహిళా పొదుపు సంఘం వగైరాలు ... డిఫెండెంట్స్

పేపరు నోటీసు

టు:

D8) డోలా సువార్తమ్మ W/o పుష్పరాజు, నివాసం : డోర్ నెం. 5-298/4, 3వ వార్డు, చిలకలూరిపేట (పోస్టు) మరియు మండలం, పల్నాడుజిల్లా.

D9) బండికట్ల రాజేశ్వరి W/o విశ్వరూపాచారి, నివాసం : డోర్ నెం.5-292/1, 3వ వార్డు, చిలకలూరిపేట (పోస్టు) మరియు మండలం, పల్నాడుజిల్లా.

D12) కావూరి నాగులు, W/o సైదారావు, నివాసం : డోర్ నెం. 5-324, 3వ వార్డు, చిలకలూరిపేట (పోస్టు) మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల కేసు మీకు పేపరు నోటీసు నిమిత్తమై శ్రీ కోర్టువారు ది. 12-5-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు ది. 12-5-2023వ తేదీన ఉదయం 10-00 గం.ల సమయంలో శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఏమైనా ఉంటే స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట తెలియపరచు కొనగలరు. అలా చేయని యెడల సదరు కేసును శ్రీ కోర్టువారు మీకు వ్యతిరేకంగా తీర్మానించగలరని ఈ పేపరు నోటీసు ద్వారా తెలియపరచటమైనది.

స్థలం: చిలకలూరిపేట.
తేది: 05-05-2023

ఇట్లు
ఎస్.సుధాకరరెడ్డి,
అడ్వకేట్,
శివాలయం ఎదురు, చౌత్రా సెంటర్,
చిలకలూరిపేట.
సెల్ : 9490897327.

గురజాల నగర పంచాయతీ
ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I.)

ఆర్.ఓ.సి. నెం. **AMRUT 2.0/2023/WATER SUPPLY/JA** తేది : **04-05-2023**

గురజాల నగరపంచాయతీ నందు **(AMRUT 2.0)** సమగ్ర మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేయుట కొరకు కనీస అర్హత ప్రమాణాలు గల, ఆసక్తి గల ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థలు / ఏజన్సీల నుండి **E.O.I.** తేది : 09-05-2023 సాయంత్రం గం.4-00 ల లోపు స్వీకరించబడును. ఆసక్తిగల కన్సల్టెన్సీ సంస్థలు/ ఏజన్సీలకు షెడ్యూల్స్ / **REP** డాక్యుమెంట్లు తేది : 05-05-2023 నుండి తేది : 08-05-2023 వరకు జారీ చేయబడును. మిగిలిన వివరములు ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును. ఏ ఒక్క కొటేషన్‌గానీ, అన్ని కొటేషన్లు గాని ఏ కారణము చూపకయే నిరాకరించుటకు కమీషనరుగారికి పూర్తి అధికారము కలదు. 7032903445.

సం/- కమీషనరు,
గురజాల నగర పంచాయతీ



వరి పైరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి

855 ఎకరాల్లో వరి పంట నష్టం

ప్రజాశక్తి-నకరికల్లు

చల్లగుండ్ల, దేచవరం గ్రామాల మధ్య అకాల వర్షాలకు పడిపోయిన వరి పంటలను పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 855 ఎకరాల వరి పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. కోత కోసేందుకు సిద్ధంగా ఉన్న వరి నేలపై పడిపోవడం జరిగిందన్నారు. గింజ రంగు మారకుండా ఉండడానికి కార్బన్డిజం మంకోజబ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళలో పిచికారి చేయాలన్నారు. తడిసిన 100 కిలోల వడ్లకు ఒక కేజీ ఉప్పు మరియు నాలుగు కేజీల ఊకను లేదా ఎండు గడ్డిని కుప్పగా చేసిన ధాన్యంలో కలిపి వారం రోజుల తర్వాత ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ దేవరాయలు, పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు, వీఆర్వో యువరాజు, దిలీప్ కుమార్,రవిబాబు పాల్గొన్నారు.



పంచాయతి నూతన కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - దాచేపల్లి

దాచేపల్లి మండలం కేశానుపల్లి పంచాయతి నూతన కార్యదర్శి నాదెండ్ల రత్నంకు మండల కన్వీనర్ కోట కృష్ణ దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అభినందనలు తెలిపారు.



నూతన వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ

వైద్య సిబ్బంది కొరత తీరినట్లే

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలలో మరో ఇద్దరు సిబ్బంది రాకతో వైద్య సిబ్బంది కొరత తీరినట్లేనని ఆసుపత్రి ప్రధాన వైద్యులు వెంకట్రావు అన్నారు . గురువారం ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ కలసి నూతనంగా చేరిన ఫార్మసీ పర్యవేక్షకరాలు జివిజయలక్ష్మి , నర్సింగ్ పర్యవేక్షకురాలు ఎం.రాధలను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఒక్క రేడియాలజిస్ట్ పోస్టు భర్తీ కావాల్సి ఉందని, అది కూడా భర్తీ అయితే ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యంలో ఎటువంటి కొరత ఉండదని అన్నారు.

పనుల్లేక పస్తులు!

- ప్రశ్నార్థకంగా భవన నిర్మాణ రంగ కార్మికుల జీవనోపాధి
- ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా లేక అస్తుబిస్తుగా పనులు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేకపోవడంతో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. సరిగ్గా పనులు లేక, అప్పులు పుట్టక, ఒకవేళ అప్పు దొరికినా తీర్చడం కష్టతరంగా మారుతోంది. రోజు వారి కూలీ పనులు చేసినా గిట్టుబాటు కాక సగానికిపైగా కార్మికులు పస్తులుంటున్న పరిస్థితి. చిలకలూరిపేట పట్టణంలో భవన నిర్మాణా రంగానికి చెందిన కార్మికులు ఐదు వేలు, నియోజక వర్గంలో అయితే, సుమారు పది వేల మంది వరకు ఉంటారు. నియోజకవర్గంలో భవన నిర్మాణ, భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ 32 రకాల చేతి వృత్తుల కార్మికులు ఉన్నారు. వీరిలో సెంట్రింగ్ సామాన్లు అద్దె కిచ్చే వారు, రాడ్ బెండింగ్, ఇసుక, కంకర, ఇటుకలు లోడ్, అన్‌లోడ్ చేసే కార్మికులు, బట్టీలలో ఇటుక తయారు చేసే కార్మి కులు, శ్లాబు, పిల్లర్లు, ఎలక్ట్రికల్, చెక్కపని, రంగులు వేసే కార్మి కులు ఇలా మొద లైన వారు ఉన్నారు. వీళ్ల కాక పట్టణ, నియోజకవర్గ పరిధిలో సుమారుగా మరో మూడు వేల మంది మహిళ భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు.నియోజకవర్గం మొత్తం సుమారు 13 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారనేది లేబర్ అధికారుల లెక్కలు. జగనన్న ఇళ్ల నిర్మాణం ద్వారా కొంత మేరకు పనులు దొరుకుతాయని, జీవనం సాగుతుందనుకున్న కార్మికులు తీవ్రంగా నిరాశే మిగిలింది. ప్రభుత్వం వారిచ్చే లక్షా 80 వేల రూపాయలు కాకుండా యజ మాని వద్ద నుంచి రూ.35 వేలు తీసుకొని మొత్తం 2 లక్షల 15 వేల రూపాయలకు ఇల్లు నిర్మించి ఇస్తానని కాంట్రాక్టర్ లబ్ధిదారులకు చెప్పి , ఆయన పనులను పూర్తి చేసేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాలను విని యోగిస్తుండటంతో వేలాది కార్మికులకు పనులు లేకుండాపోయాయి.దీనికి తోడు నిత్యావసర సరుకులు,గ్యాస్ ధరలు పెరిగిపోవడంతో భనన నిర్మాణ రంగ కార్మికుల జీవనం మరింత భారంగా మారింది. పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోంది. ట్రాక్టర్ ఇసుక ప్రస్తుతం రూ. 5,000 వేల నుంచి రూ.5,600 పలకడం, ఒక్కొ క్క ఇటుక ఖరీదు రూ.6 వరకు ఉండటం, అలాగే, ఇనుము, సిమెంట్, చిప్స్ ధరలు బాగా ఉండటంతో ఇళ్ల నిర్మాణానికి చిన్నా చితకా కుటుంబాల వారు ముందుకు రావ డం లేదు. దీంతో పూర్తిగా పనులు లేకుం డా పోయాయని భవన నిర్మాణ రంగ కార్మికులు చెబుతున్నారు.

సెంట్రింగ్ సామాన్లు అమ్ముకుంటున్నా

ఇళ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో లేక సెంట్రింగ్ సామాన్లు ఒక్కొక్కటిగా అమ్ముకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని పి. వీరాంజనేయులు వాపోయారు. గతంలో సుమారు నెలకు 5 వేల టన్నుల సిమెంటు అమ్మేవారమని ప్రస్తుతం నెలకు 2,3 టన్నుల సిమెంట్ అమ్ముతున్నట్లు చెప్పారు. అదీ కూడా జగనన్న ఇళ్లకు తప్ప పెద్దగా వ్యాపారం ఉండటం లేదని చెప్పారు.

పెరుగుతున్న వలసలు

పనులు లేకపోవడంతో నియోజకవర్గం నుంచి పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకకు కార్మికులు తరలిపోతు న్నారు. రోజూ భోజనం పెట్టి, వెయ్యి రూపాయలు ఇస్తున్నారని వలస కార్మికులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ అప్పులతో, సగం పస్తులతో జీవనం కొనసాగించే కన్నా అక్కడికి పోయి ఆ పనులు చేసుకోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

పథకాలను యథావిధిగా కొనసాగించండి

భవన నిర్మాణ కార్మికుడు ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబానికి గతంలో రూ.5 లక్షలు ప్రభుత్వ ఇచ్చే వారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని మండల సిఐటియు కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు.సంక్షేమ బోర్డులో ఉన్న పథ కాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన వాళ్లందరికీ కూడా రూ. 3,000 పెన్షన్ ఇవ్వాలనే ప్రతిపాదన బుట్టదాఖలైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తా వించారు. పట్టణంలో కూడా ఉపాధి హామీ పనులు వందరోజులు అమలు చేయాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఇసుక, సిమెంట్, ఇనుముల ధరలను తగ్గించేలా చర్యలు తీసు కోవాలని కోరారు. ముఖ్యంగా ఉదయం పూట భవన నిర్మాణ కార్మికులు పనులకు వెళ్లేందుకు ఒక చోటకు వచ్చే విధంగా స్థలం కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి: వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-రాజుపాలెం

ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై. వి ఆంజనేయులు డిమాండ్ చేశారు.మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మిరప, మొక్కజొన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అనిచెప్పుకునే ఈ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. సత్తెనపల్లి ఎడిఎతో ఫోన్ లో మాట్లాడి నష్టం అంచనా వేసి ఉన్నత అధికారులకు తెలియజేసి రైతులను ఆదుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు పల్ల పాటి పెద్దిరాజు, తెలుగు యువత అధికారప్రతిథి అల్లభక్షు, దుడ్డు అప్పారావు, సులగా వెంకటరావు, రామలక్ష్మణ రావు,యామర్తి శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





జేఈఈ మెయిన్స్‌లో విశ్వసాయి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ

స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి గత ఐదేళ్లుగా అత్యుత్తమ ఫలితాల సాధిస్తున్న విశ్వసాయి విద్యార్థులు మరోమారు ఆలిండియా స్థాయిలో నిర్వహించిన 2023 జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల కరస్పాండెంట్ శర్మ తెలిపారు. అత్యుత్తమ పర్సంటేజ్ సాధించడంలో విశ్వ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విద్యార్థులు ముందు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్. పథ్వి రాజ్ కుమార్ - 1624, బొల్లినేని మోహన కృష్ణ సాయి - 25992, సిహెచ్ లక్ష్మీనారాయణ - 41783, పఠాన్ ఆసిఫ్ ఖాన్ - 57538, ముద్దపాటి సాయి తేజ - 71855 ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడంలో కృషి చేస్తున్న విద్యాసంస్థ విశ్వ సాయి జూనియర్ కళాశాల అధ్యాపకులను, కళాశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. విశ్వసాయి జూనియర్ కళాశాల వినుకొండలో ఉండటం ఎంతో గరవ్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ ప్రదర్శన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్నాడు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో శు క్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక కళామందిర్ సెంటర్ నుండి మే డే సందర్భంగా ఆటోల ప్ర దర్శన జరుగుతోందని సి.ఐ. టి.యు మండల కార్యదర్శి పెరుబోయిన వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా సిఐటియి కార్యదర్శి ఏ.ఆంజనేయ నాయక్ పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు. ఆటోల ప్రదర్శన ఎన్. ఆర్.టి.సెంటర్ మీదుగా అడ్డరోడ్డు నుంచి తిరిగి కళామందిర్ సెంటర్ వరకు వెళుతుందని అక్కడే జెండావిష్కరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భోజన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ర్యాలీలో పట్టణ, నియోజకవర్గంలోని సిఐటియు అను బంధ సంఘాల కార్మికులు, ఆటోయజమానులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంబులెన్స్ జాడ ఎక్కడ?

ప్రజాశక్తి-అమరావతి



అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సమయంలో రోగుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్ వాహనం సుమారు ఏడాదిగా మరమ్మతులకు గురై మూలన పడింది. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వాహ నాలపై ఆధారపడాల్సి వస్తోందని సిపిఎం కార్యదర్శి బి.సూరిబాబు మండి పడ్డారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రికి కనీసం రెండు అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అకాల వర్షాలకు తడిసిన పసుపును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని పాతూరులో రైతు సంఘం నాయకులతో కలిసి, తడిసిన పసుపు కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పసుపు క్వింటాల్ రూ.6850లకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. తడిసిన పసుపు రంగు(కటుకు) మారిందనే కారణంతో ప్రైవేట్ వ్యాపారస్తులు పసుపు రైతుల వద్ద నుండి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే మద్దతు ధరకు పసుపును కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు డి.రాజేంద్ర బాబు, ఎస్. వెంకటేశ్వరరావు, ఆదం, సాంబయ్య పాల్గొన్నారు.

తెనాలిరూరల్: నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం దెబ్బతిన్న పంటపొలాలను, కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్నను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆరుగాలం పండించిన పంట పొలాలను, రైతులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్బికెలు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలు తప్ప క్షేత్రస్థాయిలో రైతులను ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

దుగ్గిరాల: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతు, కౌలు రైతులను ఆదుకోవాలని దుగ్గిరాల మండల ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రజాసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ జొన్నా, మొక్కజొన్న పంటలు గతనెల నుండి కురుస్తున్న వర్షాలకు తడిసి పోయాయని అన్నారు. రేఖలు తీసిన కండెలు కూడా వర్షంలో తడిసి రంగు మారిందని, తోడు మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే


తెనాలి రూరల్ పరిధిలో పొలాలను పరిశీలిస్తున్న శివసాంబిరెడ్డి తదితరులు


దుగ్గిరాలలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు


తెనాలిలో తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్


పొన్నూరులో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరారు. తడిచిన పంటను అర్‌బికె ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించక పోతే మే 9న రైతు, కౌలు రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వైబ్రహ్మేశ్వరావు, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి యం. నాగమల్లేశ్వరావు ,రైతు సంఘం నాయకులు వి సాంబశివరావు కౌలురైతు సంఘం మండల అధ్యక్షులు బి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

తెనాలి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కె. రవి బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనాలు వేయడంలో ప్రభుత్వం వెనకబడిందన్నారు. కల్లాల్లో ఆరబోసిన జొన్న, మొక్కజొన్న వర్షానికి తడిసి రైతుల అల్లాడుతుంటే కనీసం అధికారులు దానిపై పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రైతుల ప్రయోజనం కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆర్భాటంగా చెబుతున్న ప్రభుత్వం రైతుల పరిస్థితికి సమాధానం చెప్పాలన్నారు. నాయకులు టి హరి ప్రసాద్, కె కోటేశ్వరరావు, ఎ పిన్నారావు, ఈదర పూర్ణచంద్, జె. మహేష్, కె. ఏడుకొండలు ఉన్నారు

పొన్నూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన మద్ధతు ధరకు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తెల్లజొన్న , మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం స్థానిక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమలదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధరకు లేక మరోవైపు అకాల వర్షానికి చేతికొచ్చిన పంటకు తీవ్ర నష్టం కలిగిందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన మద్దతు ధరకు పంట కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పొన్నూరు పట్టణ,మండల టిడిపి అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, చేబ్రోలు మండల అధ్యక్షులు మైలా వెంకట రామరాజు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి వడ్రాణం హరిబాబు, తదితరులు పాల్గొన్నారు

కొల్లిపర: నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు భీమవరపు చిన్న కోటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం డిప్యూటీ తహశీల్దార్ బాలకృష్ణారెడ్డికి టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వర్షాల వలన దెబ్బతిన్న పసుపు, మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంగ సాంబిరెడ్డి గుదిబండి గోవర్ధన్ రెడ్డి అమతరాజు బొంతు చంద్రిక ఆరిమండ వెంకటరెడ్డి బసవయ్య రఫీ ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పంట నష్టం అంచనా

ప్రజాశక్తి -తెనాలి

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ సాగర ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. వర్షాలకు మొక్కజొన్న, జొన్న ఆరబోసినవి, నిలువునా తడిసిన సంగతి తెలిసిందే. పంటలను పరిశీలించిన అనంతరం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంట నష్టం అంచనా వేస్తున్నామని ప్రాథమికంగా ఇప్పటివరకు జొన్న ,మొక్కజొన్న 500 ఎకరాలలో దెబ్బతిని ఉండొచ్చు అన్నారు. అంచనాల పూర్తయిన తర్వాత నష్టాల వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. తడిసిన మొక్కజొన్న, జొన్న ఆరబెట్టుకునే విధానాన్ని, బూజు పట్టకుండా ఉండేందుకు చేయాల్సిన పిచికారిని రైతులకు వివరించారు.


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు


తడిసిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం చల్లండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అధిక వర్షాలకు తడిసిన మొక్కజొన్న జొన్న మొలకెత్తకుండా ఉప్పు కలిపిన ద్రావణం స్ప్రే చేయవలసిందిగా వ్యవసాయ అధికారుల తెలిపారు. గురువారం మండలంలోని చినపాలెం, ఈమని గ్రామలలో వర్షాలకు దెబ్బతిన్న పంటను వారు పరిశీలించి మాట్లాడారు. మొక్కజొన్న కన్నా జొన్న అధికంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు చెప్పారు. వర్షాలు ఇంకా కురుస్తూనే ఉన్నందున ఏ మేరకు పంట నష్టం జరిగిందో అంచనా వేయటం ఇప్పుడు సాధ్యం కాదన్నారు. నష్టపరిహారానికి సంబంధించిన జీవో ఇంకా రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సైంటిస్ట్ నగేష్ సహాయ సంచాలకులు కే వెంకట్రావు మండల వ్యవసాయ అధికారిని పి శిరీష చినపాలెం సర్పంచ్ వి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు కళాపరిషత్ నాటక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్




పొన్నూరు కళాపరిషత్ 22వ తెలుగు రాష్ట్రాల పోటీలు గురువారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ప్రారంభమైయ్యాయి. నన్నపనేని చంద్రమౌళేశ్వరి ప్రార్ధన గీతం ఆలపించిగా చిన్నారి ఎం. వల్లి నాగమారుతి శ్యాస్త్రీయ నృత్య ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైయాయి. తొలుత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి.వెంకట రోశయ్య పాల్గొని మాట్లాడుతూ నేటి విద్యార్థులకు కళల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ప్రాచీన కళల పట్ల నేటి తరానికి తెలిసేలా పోటీలు నిర్వహిస్తున్న పరిషత్‌ను అభినందించారు. అనంతరం శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ప్రేమతో నాన్న నాటిక ప్రదర్శన జరిగింది. ఎన్ని చట్టాలు ఉన్న న్యాయ స్థానలు ఉన్న ఎక్కడో దగ్గర స్త్రీకి అన్యాయం జరుగుతూనే ఉంది. జీవితంలో అపజయలు ఎదుర్కొని విజయం సాధించే కూతుర్లకు ప్రేమతో నాన్న నాటిక ఆలోచింపచేసింది. రెండో నాటికగా శ్యార్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంఘం బొరివంక శ్రీ కాకుళం వారి కొత్త పరిమణం నాటిక ప్రేక్షకులను రంజింపచేసింది. కార్యక్రమంలో ఎంపిపి భవనం పద్మ లీల, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జక్కా శ్రీనివాసరావు, ఎస్.ఆంజనేయులు నాయుడు, ఆకుల సాంబశివరావు పాల్గొన్నారు.


జవహర్ రాజుకు జ్ఞాపిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రచయిత జవహర్‌రాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో గురువారం ఎన్టీఆర్ నటించిన కంచుకోట చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా కళాకారుడు, రచయిత బిళ్ళ జవహర్ రాజును పార్టీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, పెమ్మసాని పోతురాజు, ఎస్. సాంబశివరావు, పి. సురేష్ తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డి.భవాని, ఎస్ సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, దాసరి నరసయ్య, వెలగ సుభాష్ చంద్రబోస్, ముళ్లపూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లిడ్ క్యాప్‌కు నిధులు కేటాయించాలని గవర్నర్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

లిడ్ క్యాప్‌కు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం నాయకులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం విజయవాడ రాజ్ భవన్‌లో గవర్నర్‌ను ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం అధ్యక్షులు బుల్లా రాజారావు, నాయకులు కలిశారు. రాష్ట్రంలో లిడ్ క్యాప్ సంస్థకు రూ.120 కోట్ల నిధులు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ద్వారా కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాస్, కార్యదర్శి బుల్లా రాజీవ్, చిలకా భాస్కర్, బేతపూడి అచ్యుత గవర్నర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

మే డే కవితల పోటీల్లో ఆళ్లకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్


ఆళ్ల నాగేశ్వరరావు

తెలుగు ఉభయ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వచన కవితల పోటిల్లో తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు పంపిన అందరికి ఆదర్శుడై ఉండాలి కవితకు ప్రథమ బహుమతి లభించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన తెలుగురాజ్యం కల్చరల్ ఫౌండేషన్ న్నిర్వహించిన నాయకుడంటే ఎలా ఉండాలి అనే అంశం పై మేడే పురస్కరించుకుని రచనల పోటీలు నిర్వహించగా ఆళ్లకు బహుమతితో పాటు రూ. 15 వందలు ప్రైజ్‌మనీ గెలుచుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపరాజు రవి అంతర్జాలం ద్వారా గురువారం ప్రకటించారు. ఉభయ తెలుగు రాష్ట్రా స్థాయిలో శతకానికి పైగా కవులు పోటీపడిన పోటిల్లో ఆళ్ల నాగేశ్వరరావు ప్రథమ బహుమతి పొంది విజేతగా నిలవడం ఆయన ప్రతిభకు నిదర్శనమని గోపరాజు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషికి పట్టణ ప్రజలు సహకరించాలని ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ ఒ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక షాలెంనగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో, మురుగు కాల్వలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. మురుగు కాల్వలలో చెత్తా చెదారం వేయొద్దని, తడి పొడి చెత్తను వేరువేరుగా నిల్వ చేసి ఇంటివద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు అందజేయాలని అన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా పరిసరాల పరిశుభ్రతకు బాధ్య తాయు తంగా పని చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాల్వలలో పూడికతీత పనులను ముమ్మరం చేయాలని,ప్రతి వార్డులో శానిటేషన్ సెక్రటరీ దగ్గరుండి చూసుకోవా లని ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు రామకోటయ్య పాల్గొన్నారు.




పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



మొర్జంపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-మాచవరం

మాచవరం పలనాడు ఆంధ్రభూమి. మాచవరం మండలం మొర్జంపాడు గ్రామాల్లో గురువారం స్థానిక హెల్త్ క్లినిక్ లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ చక్రవర్తి రోగులకు పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 104 వాహనం ద్వారా ప్రతి ఇంటికి తిరుగుతూ వైద్య సేవలు కొనసాగించారు. ఈ వైద్య శిబిరంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారంపై సూచనలు సలహాలు అందజేశారు అలాగే గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకుంటే దోమల వ్యాప్తి చెంది మలేరియా వ్యాధి సోకే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చక్రవర్తి సూచించారు ఈ కార్యక్రమంలో 104 సిబ్బందితోపాటు ఆ గ్రామ ఏఎన్ఎం ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు



రైతులకు నష్టపరిహారమివ్వండి

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని పల్నాడు తెలుగు రైతు సంఘం కార్యదర్శి ఆధ్వర్యంలో అమరావతి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజశేఖర్ కు వినతిపత్రం గురువారం అందజేశారు. అమరావతి మండలంలో అకాల వర్షానికి పంటల దెబ్బతిన్నాయి. వెంటనే ఆదుకోవాలని అన్నారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.30 వేలు, మిరప పంటకు ఎకరానికి రూ.50 వేలు, పసుపు పంటకు ఎకరానికి రూ. 20 వేలు, అలాగే దెబ్బతిన్న అరటి బొప్పాయి తోటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.



గంగిరెడ్డిపాలెంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-మాచవరం

మాచవరం మండలం గంగిరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించిన దేమి కర్మ మన రాష్ట్రానికి మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అవినీతి పరిపాలన సాగుతోందని విమర్శించారు.ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రజలు వారి సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకెళ్లారు. గంగిరెడ్డిపాలెం, మండలం టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని టిడ్కో హౌసెస్, జగనన్న కాలనీకి సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో గురువారం మెప్మా సి.ఓ లు ఆర్.పి. లతో సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ షేక్. రఫాని, మెప్మా సి.ఎమ్. ఎమ్. మాలతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఫానీ మాట్లాడుతూ పట్టణంలోని టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారులందరినీ కలసి వారికి కావాల్సిన సదుపాయాలను కలుగజేయాలని, వారి గృహాలకు పంపించాలని కోరారు. అంతేకాకుండా జగనన్న కాలనీలోని ఇళ్ల లబ్ధిదారుల అకౌంట్లు ఓపెన్ చేని, ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రజలకు టిడ్కో గృహాలు, జగనన్న కాలనీ సంబంధించి ఏదైనా అనుమానాలు ఉంటే మున్సిపల్ కమిషనర్ గోవిందరావును కలిసి అనుమానాలను నివృతి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



వైసిపి పాలనలో అభివృద్ధి వెనక్కి : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో నలబై ఏళ్ల వెనక్కి నెట్టారని, అదే స్థాయిలో దోపిడీ జరిగిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు విమర్శించారు. గురువారం స్థానిక పల్నాడు జిల్లా టిడిపి కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి పాలనలో అవినీతి,అక్రమాలు, దుర్మార్గాలు పెరిగి పోయాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజే అన్న క్యాంటీన్లను మూసివేసి కడుపు కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి పానలో ఇసుక,మట్కా, డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా, రేషన్ మాఫియా యథేచ్ఛగా జరుగుతున్నాయని, కరోనా సమయంలో స్థానిక ఎమ్మెల్యే ఆక్సిజన్ సిలిండర్లు , రెమిడిసివర్ ఇంజక్షన్లు అమ్ముకుని కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు.

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 2014 నుంచి 2019 సమయంలో ఎమ్మెల్యే కు చెందిన హాస్పిటల్ లో వైద్యం వికటించి ఎంతమంది చనిపోయారో ఎంత మందికి డబ్బు ఇచ్చి రాజీ చేసుకున్నారనే దానికి తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెప్పారు. ఎస్పీ, కలెక్టర్ సమక్షంలో బహిరంగ చర్చకు రావాని ఎమ్మెల్యేకు ఆయన మరోమారు సవాల్ విసిరారు.రెండు రోజుల క్రితం అల్లూరివారి పాలెంకు చెందిన ఆటో డ్రైవర్ జేమ్స్ హత్య, రొంపిచర్ల మండల టిడిపి అధ్యక్షుడువెన్నా బాకోటిరెడ్డి హత్య, నియోజకవర్గంలో జరిగిన ప్రతి హత్యలో ప్రత్యక్ష, పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యేకు సంబంధం ఉందని ఆరోపించారు. సమావేశంలో టిడిపి నాయకులు జి.జనార్ధన్ బాబు, కిరణ్, వి. నాగేశ్వరరావు,ఆర్.జగ్గారావు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శ్రద్ధ చూపండి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలో ఓటరు నమోదుపై బిఎల్ఓ లు శ్రద్ధ చూపాలని తహశీల్దార్ పుల్లారావు ఆదేశించారు గురువారం ఓటు నమోదుపై బిఎల్వోలతో నిర్వ హించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



పల్నాటి యాదాద్రి నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాల మండలంలోని జంగమేశ్వరపురంలో పల్నాటి యాదాద్రి నరసింహస్వామి ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధ్య క్షులు, శాసనమండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, నరసరావుపేట పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం,సమీప గ్రామాల భక్తులు పాలొన్నారు.

7న అల్లూరి సీతారామరాజు సంస్మరణ సభ

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా మాచర్ల ఎం.సి.పి.ఐ కార్యాలయంలో ఈ నెల 7న పిడిఎం ఆధ్వర్యంలో జరిగే విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ సంస్మరణ సభను జయప్రదం చేయాలని దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం పల్నాడు జిల్లా కమిటీ కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ కార్యాలయంలో సంస్మరణ సభకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంస్మరణ సభకు పిడిఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్రహం లింకన్ సిపిఐ మాచర్ల పట్టణ కార్యదర్శి ఎం బాబురావు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

ప్రజాశక్తి - రెంటచింతల

నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి ఏ మోహన్ సూచించారు గురువారం రెంటచింతలలోనే రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సరీల నిర్వాహకులు రైతులకు నాణ్యమైన నారుతోపాటు, మొక్కల అమ్మకానికి సంబంధించి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు నర్సరీలకు సంబంధించి రిజిస్ట్రేషన్, సస్యరక్షణ వివరములు రిజిస్టర్, విత్తన కొనుగోలు రిజిస్టరు, తప్పనిసరిగా నిర్వహించాలన్నారు ఆర్ బి కే సిబ్బంది ఎప్పటికప్పుడు నర్సరీల తనిఖీ చేయాలన్నారు అనంతరం నర్సరీ చట్టం, ఉద్యానవన శాఖ పథకాలు, డ్రిప్పు ఇరిగేషన్, ఈక్రాపు, తదితర అంశాలపై అవగాహన గురజాల ఉద్యానవన శాఖ పరిధిలో రెంటచింతల,గురజాల, కారంపూడి, దాచేపల్లి మండలాల్లో 149 ఎకరాల్లో నర్సరీలు ఉన్నాయన్నారు.

వేసవి సంగీత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన తల్లి పిల్లల వైద్యశాల రోడ్డులో ప్రతిభ గాన కళ శిక్షణ కేంద్రంలో ప్రఖ్యాత జాతీయ సంగీత సద్గురువులు రాజు నేతృత్వంలో వేసవి సంగీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గురువారం తెలిపారు. శిక్షణలో సంగీత పాఠాలు, భక్తి, దేశభక్తి గీతాల పట్ల ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏడేళ్ల వయసు దాటిన వారు ఎవరైనా ఈ నెల6వ తేదీలోపు వారి పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెల రోజులపాటు సంగీతం అట్ల శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలవారు 9676259830 సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శుక్రవారం 5 మే 2023



మాట్లాడుతున్న ఎంపిపి భవనం పద్మలీల

లోకోస్ యాప్‌పైశిక్షణ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వైయస్సార్ క్రాంతి పథం గ్రామ డ్వాక్రా సంఘాల అసిస్టెంట్లకు లోకోస్ యాప్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ భవనం పద్మలీల పాల్గొని మాట్లాడుతూ ఒకే యాప్‌లో మొత్తం మహిళా సంఘాల లావాదేవీలు చూసుకోవడానికి లోకోస్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ప్రతి విఓఏ సంఘ సభ్యుల వివరాలు పారదర్శకంగా నమోదు చేసుకోవాడని కి ఉపయోగపడుతుందన్నారు.ఏపీవో గోపి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాధి ఎన్ఆర్ఎల్ఎం మిషన్ ఆధ్వర్యంలో ఈ యాప్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ ఎంపీపీ భవనం పద్మలీల ఏపిఓ గోపి మండల సమైక్య అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు



సీలింగ్ ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఆస్పత్రికి ఫ్యాన్లు, లైట్లు బాహూకరణ

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి నారా లోకేష్ సహకారంతో గురువారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు 5 సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు గురువారం ఆస్పత్రి డాక్టర్ పద్మజాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, జి ధనుంజయ రావు, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, షేక్ సుభాని, కే అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పెదనందిపాడు

మండలంలోని గోగులమూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత శంకుస్థాపన చేశారు, రూ. 77.90 లక్షల అంచనా వ్యయంతో గ్రామ సచివాలయం, రైతు భరోసా, డిజిటల్ లైబ్రరీలకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు సంపూర్ణంగా అందించేలా వైసిపి పాలన సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ కాసిం పీరా, గోగులమూడి గ్రామ సర్పంచ్ చెన్నుపాటి ఆనందరావు, సత్యనారాయణ, ఎంపీపీ టి హెబ్సిబాలు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ఎం. సత్యకుమారి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి వారి ఆదేశాల మేరకు మే13న పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడి తగిన క్రిమినల్ కేసులు,సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చున్నారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రత్యక్షంగా హాజరు కావచ్చున్నారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్ 9492662537 లేదా మెయిల్ ఐడి: pnr-misc@yahoo.com నందు సంప్రదించాలని కోరారు

హిందూ ఫార్మశీ కాలేజి విద్యార్థుల రక్తదానం



రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో జాతీయ సేవా సంస్థ (ఎన్ఎస్ఎస్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, గుంటూరు బ్రాంచ్ సంయుక్తంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పాల్గొని రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలియచేస్తూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుతం తలసేమియా వ్యాధి ఉన్న వారికి, రక్త హీనత ఉన్న వారికి అవసరమైన రక్తనిధులను సేకరించటానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్ మాట్లాడుతూ రక్తదానం వలన ఉపయోగాలను గురించి విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దంతులూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పి. లక్ష్మీసుదా

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలకు తొలి ప్రాధాన్యత నిస్తుందని మున్నంగి పీహెచ్‌సి వైద్యాధికారి పి.లక్ష్మీ సుధా అన్నారు. వైయస్సార్ కుటుంబ వైద్య విధానం అమలు కార్యక్రమంలో భాగంగా గురువారం దంతులూరు గ్రామ అంగన్వాడి కేంద్రంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గర్భిణీలను, చిన్నారులను పరీక్షించి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలక వ్యాధులతో బాధపడేవారు, ఆరోగ్య శిబిరానికి రాలేని వారికి ఇంటి వద్దకు వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అందె బాలచంద్రమౌళి హెల్త్ విజిటర్ దమ్ము ఆశీర్వాదం, కవిత ,స్వరూప రాణి ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కురగల్లు పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



నూతన పాలక వర్గ సభ్యులను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరిలో ది మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయంలో గురువారం కురగల్లు పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ వైసిపి పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ హాజరయ్యారు. కురగల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా నీరుకొండ గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా కురగల్లుకు చెందిన కట్టెపోగు సోమయ్య, నీరుకొండకు చెందిన చలమలపల్లి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ నూతన పాలకవర్గ చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లచే సొసైటీ కార్యదర్శి రాయల్ రమేష్ ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ వెంకటేశ్వరరావును, డైరెక్టర్లలను మంగళగిరి పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, వైసిపి నాయకులు, సొసైటీ సిబ్బంది శాలువాలతో సత్కరించి అభినందించారు.



ఒప్పంద పత్రాలను అందజేస్తున్న వీసి రాజశేఖర్

ఎఎన్‌యు, విజ్ఞాన్ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, విజ్ఞాన్ విద్యా సంస్థల మధ్య గురువారం అవగాహనా ఒప్పందం జరిగింది. వర్సిటీ విసి ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ విజ్ఞాన్ విద్యాసంస్థల రిజిస్ట్రార్ ఆచార్య డా ఎం.రఘు నందన్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థలకు చెందిన ఆచార్య డా డి.విజయ రాము, డా. జితేంద్ర, డా ఎ. శివ శంకర్, విశ్వ విద్యాలయానికి చెందిన ఆచార్య కె. మధుబాబు, ఆచార్య రత్నాకర్, ఆచార్య ప్రమీల రాణి, ఆచార్య సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

8న ఐటిఐలో రోజ్ ఘార్ మేళా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణంలో 8వ తేదీన అప్రంటీస్-రోజ్ ఘార్ మేళ నిర్వహించనున్నట్లు చినరావూరు తోట ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు రోజ్ ఘార్ మేళా ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. అప్రెంటీస్ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలలో అన్ని ట్రేడుల్లో శిక్షణ పొంది సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత, ఆధార్ కార్డు నకలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకొని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. అప్రెంటిస్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలియజేశారు. వివరాలకు 9959828100, 9985614465 నంబర్లను సంప్రదించాలని కోరారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న కత్తెర సురేష్ కుమార్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరులో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి - అమరావతి రహదారి మరమ్మతులు చేయించి బస్ సౌకర్యాన్ని పునరుద్ధరించడం జరిగిందని సురేష్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలోకం సురేష్,శంగారపాటి సందీప్,ఆలూరి శ్రీనివాసరావు,బి శివారెడ్డి,కొప్పుల అంద్రెప్ప,బెజ్జం రాంబాబు,నేలపాటి నాగేంద్రం,కొప్పుల శేషగిరిరావు,పులి ప్రభుదాస్ పాల్గొన్నారు.

రూ 50 వేలు ఆర్థిక సాయం..

ఇటీవల మృతి చెందిన బోరుపాలానికి చెందిన వైసిపి ఎస్సీ సెల్ నాయకులు తురకా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు కత్తెర సురేష్ కుమార్ గురువారం రూ 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.



రిలేనిరాహార దీక్ష శిబిరంలో తుమ్మలచెరువు పంచాయతీ పారిశుధ్య కార్మికులు

ఆకలిని తట్టుకోలేక నిరాహార దీక్ష

పెండింగ్ జీతాల కోసం తుమ్మలచెరువు పంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆందోళన - రిలేదీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆరు నెలలుగా జీతాలందని తాము అర్ధాకలితో పని చేస్తూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నామని మండలంలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆవేదన వెలిబుచ్చారు. పైగా దిక్కున్నచోట చెప్పుకోండంటూ స్థానిక ప్రజాప్రతినిధులు చులకనగా మాట్లాడుతున్నారని వాపోయారు. పెండింగ్ జీతాల కోసం పంచాయతీ కార్యాలయం సమీపంలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం రిలేదీక్షలు చేపట్టారు. దీక్షలను ప్రారంభించిన సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక్కో కార్మికునికి ప్రభుత్వం నెలకు రూ.6 వేలు ఇస్తుండగా వాటిని ఆరు నెలలగా పెండింగ్‌లో పెట్టారని, గ్రామపంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.2 వేలు ఇస్తుండగా వాటినీ 30 నెలలుగా ఇవ్వడం లేదని చెప్పారు. రెక్కల కష్టంతోనే బతికే వీరికి జీతాలు ఇవ్వకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం దారుణమన్నారు. పైగా పంచాయతీ పెంచిన రూ.2 వేలను అడుగుతుంటే స్థానిక సర్పంచ్ చులకనగా మాట్లాడ్డం అన్యాయమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి జీతాలను సత్వరమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీక్షల్లో కార్మికులు బి.రాజేష్, జి.సుందర్రావు, టి.సల్మాన్, బి.సుందర్రావు, ఎలిషా, బి.సామ్యేల్ పాల్గొన్నారు.

పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు రద్దు అప్రజాస్వామికం

మధ్యతరగతి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టల్ రంగంలో జాతీయ కార్మిక సంఘంగా పేరుపొందిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని, ఏకపక్షంగా చేసిన ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ మధ్యతరగతి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశానికి బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.సాంబశివరావు అధ్యక్షత వహించారు. పోస్టల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాల్లో కీలకపాత్ర పోషిస్తూ, ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్న తమ యూనియన్ గుర్తింపును



మాట్లాడుతున్న రామకృష్ణ

కక్షపూరితంగా రద్దు చేశారని తెలిపారు. రైతుల ఉద్యమానికి సహాయపడ్డామనే కారణంతో యూనియన్ల మనుగడపై దాడి చేయడం అమానుషమని అన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్.అబ్దుల్‌సలీం మాట్లాడుతూ పోస్టల్ యూనియన్ గుర్తింపు రద్దుకు ప్రభుత్వం చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని, అత్యంత అసంబద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు కార్మిక సంఘాలపై దాడి చేస్తోందని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాల తరపున వై.నేతాజీ, ఎం.కళాధర్, ఎం.హనుమంతరావు, వివికె.సురేష్, సిహెచ్.విద్యాసాగర్, ఎన్.నాగేశ్వరరావు, ఎమ్‌డి అక్బర్ పాల్గొన్నారు.

పెన్షనర్లు 10వ తేదీలోపు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - నరసరావుపేట : పల్నాడు జిల్లా పరిధిలో ఉప ఖజానా ద్వారా పెన్షన్ పొందుతున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పెన్షనర్లు ఈనెల 10వ తేదీలోపు ఇకెవైసి చేయించుకోవాలని పల్నాడు జిల్లా ఖజానా అధికారి స్వామినాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరిలో బిడుదలైన జీవో 7 ప్రకారం ప్రతి పెన్షనర్ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని, సిఎఫ్‌ఎంఎస్ ఐడిలను ఆధార్ కార్డుకు మొబైల్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ట్రెజరీ కార్యాలయంలో లేదా ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్ఇఆర్‌బి యాప్‌లో ఇకెవైసి చేయించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఖజానా కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.



కర్రీస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే షాపులు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే షాపులు సీజ్ చేయటంతోపాటు, చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఏటి అగ్రహారం మెయిన్‌రోడ్డులో ఎంహెచ్ఒ డాక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారుల బృందం వ్యాపార వాణిజ్య సంస్థలను ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నదీ లేనిది, రెన్యువల్, ట్రేడ్ ఫీజులు చెల్లింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్‌లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న మెకానిక్ షాప్‌ను సీజ్ చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచకపోవటంపై కర్రీస్ పాయింట్‌కు రూ.5 వేలు అపరాధ రుసుం విధించి, మరో 5 షాపులకు నోటీసులు జారీ చేశారు. చట్ట ప్రకారం నగరంలో ప్రతి వ్యాపార వాణిజ్య సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేస్తే సీజ్ చేయక తప్పదని హెచ్చరించారు. గతంలో తీసుకున్న లైసెన్స్‌లను కొందరు రెన్యువల్ చేసుకోలేదని, వారు కూడా వెంటనే రెన్యువల్ చేసుకోవాలని స్పష్టం చేశారు. వ్యాపార సంస్థలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా హోటల్స్, టిఫిన్, కర్రీస్ పాయింట్స్ వంట ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నిర్వాహకులు కూడా కూడా తమ వ్యాపార నిర్వహణ కోసం ట్రేడ్ లైసెన్స్‌ని సమీప వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత గడువులోగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్లు ఆనందకుమార్, సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



పతకాలతో సాదియా ఆల్మస్ (మధ్యలో)

సాదియా ఆల్మస్‌కు మరో 5 పతకాలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మస్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మరోసారి పతకాలు సాధించారు. ఈనెల ఒకటో తేదీ నుండి కేరళలో నిర్వహిస్తున్న ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కిలోల విభాగంలో 3 బంగారు పతకాలు, రెండు రజత పతకాలు సాధించారు. స్క్వాట్ విభాగంలో 190 కిలోల బరువెత్తి బంగారు పతకం, బెంచ్‌ప్రెస్‌లో 77.5 కిలోలతో రజత పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 160 కిలోలతో బంగారు పతకం, మొత్తంగా 427 కిలోలతో బంగారు పతకం సాధించారు. స్క్వాట్‌లో 190 కిలోల బరువును ఎత్తి ఆసియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కొత్త రికార్డును నెలకొల్పి ఓవరాల్ బంగారు పతకం సాధించినట్లు కోచ్, తండ్రి షేక్ సందాని తెలిపారు. పతకాలు సాధించిన సాదియా ఆల్మస్‌ను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, సూర్యనారాయణ, సకల కోటేశ్వర రావు, గుమ్మడి పుల్లేశ్వరరావు అభినందించారు.

ఉపాధి హామీ కూలీలకు నష్టం చేస్తున్న విధానాలు

- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురజాలలో నిరసన
- 22న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం కోసం కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధి హామీ కూలీలకు నష్టం చేస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటోస్ విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లాలోని గురజాలలో ఉపాధి హామీ పని ప్రదేశాలను నాయకులు గురువారం సందర్శించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కూలీల హాజరుపై కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విధానం వల్ల నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలు తలెత్తి కూలీలకు ఇబ్బందిగా మారిందన్నారు. పొమ్మనకుండానే పొగబెట్టినట్లు ఈ విధానం, రెండు పూట్ల పని విధానాలు ఉన్నాయన్నారు. పాత పద్ధతిలోనే పేస్లిప్పులు, సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలని, సైట్ సూపర్వైజర్లకు ఒక్కొక్క కూలికి రూ.10 చొప్పున అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీని నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని, అందులో భాగంగా ఇటీవల బడ్జెట్‌లో రూ.33 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్‌తో ఒక్కొక్క కూలీకి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

22 రోజులే పని కల్పించగలరని, చట్ట ప్రకారం కల్పించాల్సిన 100 రోజుల పని గురించి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ప్రతి కూలికి 200 పని దినాలు కల్పించి కనీస వేనతం రూ.600 ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనతోపాటు ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కూలీలు, పేదలంతా కదలాలన్నారు. చట్టం రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4-21 తేదీల్లో అన్ని గ్రామాల్లోనూ ప్రచారం చేస్తామని, పని ప్రదేశాలను సందర్శిస్తామని, 22న జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి యువత కీలకం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ మానవాళితోపాటు, ఇతర జీవాలకు, పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమే కృషిలో రేపటి తరానికి వారసులైన విద్యార్థులు, యువత ఉద్యమంగా ముందుకు రావాలని నగరపాలక సంస్థ పర్యావరణ ఇంజినీర్ డాక్టర్ జి.అనిల్‌కుమార్ కోరారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ అంశంపై స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, పునరుత్పత్తి మేనేజ్మెంట్ అంశాలపై స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఐటిసి వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో నగరపాలక సంస్థ విద్యాసంస్థలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 400 ఏళ్లపాటు భూమిలో కరగక 16 తరాలపై తీవ్ర ప్రభావం చూపించే ప్లాస్టిక్ వాడకాలకు ప్రత్యామ్నాయ ఉత్పాదక వస్తువుల వాడకాలపై ప్రజలు తప్పనిసరిగా శ్రద్ధ కనపరచాలన్నారు. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉన్న కవర్లను పూర్తిగా నిషేధిస్తూ రీసైకిల్డ్ తిరిగి ఉపయోగించే వస్తువుల తయారీకి చిన్న మధ్య తరహా



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

పరిశ్రమలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ రిసోర్స్ పర్సన్ వి.జస్వంత్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎ.అపర్ణ సీతారాం, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ బి.శ్రీదేవి, డాక్టర్ కె.అనూష పాల్గొన్నారు.